

కోర్కెలు తీర్చే గణేశుడు

జై జై గణేశా.. జై కొడతాం గణేశా.. వరములివ్వు బొజ్జ గణేశా అంటూ.. చాలా మంది చవితి ఉత్సవాల్లో స్వామిని మొక్కుకుంటారు.. ఈ చిత్రంలోని విగ్రహం చూశారా.. ఏడాదంతా స్వామికి అదే పని.. ఎందుకంటే స్వామి చెవిలో కోర్కెలు చెప్పుకుంటే తీరుతుందని నమ్మకం.. ఈ విగ్రహం ఈ నాటికి కాదండోయ్ 9వ శతాబ్దానికి చెందినది .. ఎత్తు ఎంతో తెలుసా.. అక్షరాలా 10 అడుగులు.. స్వామి స్వయం భూగా వెలిశారు.. ఇంతకీ ఎక్కడ ఉందో తెలుసా.. మన జిల్లాలోని బిక్కవోలులో.. రేపటి నుంచి చవితి ఉత్సవాల ఆరంభం సందర్భంగా స్వామిని ఒకసారి దర్శించుకుందాం.. కోర్కెలు చెప్పుకుందాం. - వివరాలు 7లో



వచ్చేస్తోంది : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి



ఉగ్రగోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద సుడులు తిరుగుతున్న గోదావరి

అమ్మో.. వరద

గోదావరి ఉరుకులు..పరుగులు

- ధవళేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక
- అంతకంతకూ పెరుగుతున్న వరద
- దిగువకు 10,04,528 క్యూసెక్కులు
- విజయవాడ ఘటనతో ఆందోళన
- భయం..భయంగా జనం
- భద్రాచలం వద్ద తగ్గుముఖం

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూ రు :గోదావరి వరదంటే భయమేస్తోంది. కృష్ణానది, బుడ మలేరు ప్రభావం కారణంగా విజయవాడలో లక్షలాది మంది కష్టాలు చూస్తున్న జనం వణికిపోతున్నారు. అఖండ గోదావరి వరకూ పెద్దగా ఇబ్బంది లేదని భావిస్తుంటారు..నిన్నటి వరకూ బెజవాడ ప్రజలదీ అదే ధైర్యం..కానీ ఒక్కసారిగా మునిగే సరికి కష్టాలను చూస్తున్నారు. ఇదిలా ఉండగా నిన్నటి వరకూ ప్రశాంతంగా కనిపించిన గోదావరి మళ్లీ ఉగ్ర రూపం దాల్చుతుంది. ఉరుకులు.. పరుగులు పెడుతుంది.. నిన్నటి వరకూ ప్రశాంతంగా కనిపించిన గోదావరి ఒక్క సారిగా పెరిగింది. ఎప్పుడూ ప్రశాంతంగా ప్రవహించే అఖండ గోదావరి తన సహజత్వానికి విరుద్ధంగా సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. దీంతో జనం భయపడుతున్నారు.. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలను వరద గోదావరి పూర్తిగా ముంచెత్తింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి 7 గంటల సమయంలో 45.50 అడుగులకు చేరింది. ఇది 11 గంటల సమయానికి 44 అడుగులకు చేరి తగ్గుముఖం పట్టింది.పోలవరం, రాజమహేంద్రవరం వద్ద అఖండగోదావరి ఉరకలేస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 11 గంటలకు నీటిమట్టం 11.90 అడుగులుగా ఉంది. పాండ్ లెవల్ 14.20 మీటర్లుగా ఉంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.డెల్టా కాలువలకు 1800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. ఇక బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10,04,528 క్యూసెక్కులు ప్రవాహం వెళుతోంది. ఇది కోనసీమ లంకలను ముంచుతూ సము ద్రంలోకి పోతోంది.ఈ నేపథ్యంలో ఎగువ నుంచి అధికంగా వస్తున్న వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ధవళేశ్వరం బ్యారేజీకి ఉన్న నాలుగు ఆరమ్‌ల లోని 175 గేట్లను పూర్తిగా ఎత్తివేసి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వద్ద ఉధృతి పెరిగింది. ఈ ఉధృతి మరో 24 గంటల పాటు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద తగ్గడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. వరద ప్రవాహంతో నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిలో ఎవరు దిగరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.రెవెన్యూ సిబ్బంది,పట్టణ పోలీసులతో స్నానఘట్టాల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహశీల్దార్ కె. అజయ్‌బాబు రెవెన్యూ సిబ్బందితో కలిసి కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామం వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. మద్దూరులంక గ్రామంలోకి గోదావరి నుంచి వరద నీరు ప్రవేశించే మార్గాల్లో ఇసుక బస్తాలు వేశారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. వరద మరింత పెరిగితే మద్దూరులంక గ్రామస్తులు పునరావాస కేంద్రానికి తరలిరావాలని సూ చించారు. మరొక పక్క ఎర్రకాలువ పొంగుతోంది.గత నెలలో ఎర్రకాలువ పొంగడం వల్ల నిడద వోలు,గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ పంట నష్టం జరిగిన సంగతి తెలిసిందే.కొవ్వాడకాలువకు నీరు చేరుతోంది.ముందస్తు జాగ్రత్తగా రాజమండ్రి అఖండగోదావరి లోని లంక ప్రజల కోసం రాజమండ్రిలో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలి పారు.జేసీ ఎస్. చినరాముడు ఎర్రకాలువ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు.



మద్దూరులంకలో గట్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు

సీతానగరం,సెప్టెంబరు 5 : గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున అన్ని రకాల మందులు వైద్య శిబిరాల్లో అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సీతానగరం మండలం బొబ్బిల్లంక పీహెచ్‌సీని గురువారం సందర్శించి తదుపరి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. కుక్క, పాము కాటు, మందులతో పాటు అన్ని రకాల మందులు పీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై అడిగితెలుసుకున్నారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె. చైతన్య, ఏసురాణి, ఎంపీహెచ్‌ఈవోలు పాల్గొన్నారు..



ఎర్రకాల్వ వద్ద వివరాలు సేకరిస్తున్న జేసీ చిన్నరాముడు

ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

నిడదవోలు, సెప్టెంబరు 5 : ఎర్రకాల్వ ఉధృతి కారణంగా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామాల మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయని జేసీ ఎస్.చిన్నరాముడు గురువారం తెలిపారు.ఎర్రకాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గురువారం పరిశీలించారు.ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా ఎర్రకాల్వ ఉధృతంగా ప్రవహిస్తుందని తెలిపారు.కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు తెలిపారు.కంసాలిపాలెం మార్గంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.ఆయన వెంట తహశీల్దార్ బి.నాగరాజు నాయక్ అధికారులు ఉన్నారు.

విఘ్నాధిపతినీ..వదలరా!?

ఫార్మాలిటీ ఇస్తేనే సింగిల్ విండో అనుమతులు - కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

రాజమహేంద్రవరం సిటీ,సెప్టెంబరు 5 : కలెక్టర్ చెప్పినా.. ఎస్పీ చెప్పినా అధికారులు వింటారా.. ఎవరు చెప్పినా మామూళ్లు మామూలే.. ఎంతలా అలవాటు పడిపోయారంటే చివరికి దేవుడి దగ్గర భయంలేదు. వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన సంగతి తెలిసిందే.. కొన్ని శాఖల సిబ్బంది సింగిల్ విండో విధానానికే చెడ్డపేరుతెస్తున్నారు.చవితి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.ఈ మేరకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు అగ్నిమాపక, పోలీస్, కార్పొరేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.తీరా అనుమతులకు కమిటీలు సంబంధిత శాఖల కార్యాలయాలకు వెళితే అక్కడ అన్నీ పార్మాలిటీలే. దీంతో కమిటీలు కంగుతింటున్నాయి. వాస్తవానికి రూల్ ప్రకారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ట్రెజరీలో రూ.1000 చలానా కట్టి దానిని తీసుకుని,అగ్నిమాపక శాఖ కార్యాలయానికి వెళ్లి అక్కడ రూ.500 చలానా కట్టి, బయట ఆన్‌లైన్ దార్వా మైక్‌కు రోజుకు రూ.100 చొప్పున చలానా కట్టి ఈ పేపర్లు తీసుకుని నోటరీ చేయించుకుని అన్నీ పట్టుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ పోలీస్ వారు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసుకుని అనుమతి పత్రాలు జారీ చేస్తారు.పోలీసులు నోటరీకి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడంలేదు.మామూళ్లు ఇస్తే మామూలే అంటున్నారు.ఫైర్ స్టేషన్‌లో రూ.500, పోలీస్ స్టేషన్‌లో రూ.500 లు చొప్పున మామూళ్లు (పార్మాలిటీ) తీసుకుంటున్నారని ఉత్సవాలు నిర్వహించే యువకులు గగ్గోలు పెడుతున్నారు. సగటున ఒక్కో కమిటీ రూ.వెయ్యి రూపాయలు అదనంగా వసూలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ చెప్పిన విధానానికి తూట్లు పొడుస్తూ కొంత మంది అనుసరిస్తున్న తీరుపై ఉత్సవ కమిటీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్మాలిటీలే ఎక్కువ కావడం శోచనీయం.

మేమున్నాం..అండగా!

నాలుగో రోజునా ఆదుకున్నారు...



సీఎం సహాయనిధికి రూ.5 లక్షల చెక్ లోకేశ్‌కి అందజేస్తున్న రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు జిల్లా యంత్రాంగం ఉదయం అల్పాహారం 27,500 ప్యాకెట్లను పంపించారు. ఉదయం 14 వాహనాల్లో ఫుడ్ ప్యాకెట్లు, 50 వేల వాటర్ ప్యాకెట్లను పంపించినట్టు కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. 55 వాహనాలలో బియ్యం, ఆహార పదార్థాలు, పాలు, బిస్కెట్లు, రస్కులు, తాగునీరు పంపించారు.మధ్యాహ్నం భోజనాలకు 8 వాహనాల ద్వారా 23 వేల ఫుడ్ ప్యాకెట్లు పంపామని తెలిపారు. రాత్రి భోజనాలకు జిల్లా నుంచి 10 వాహనాల్లో 34,500 ఫుడ్ ప్యాకెట్లు , 17 వేల వాటర్ బాటిల్స్35 వేల బిస్కెట్ ప్యాకెట్లు ,20 వేల క్యాండిల్స్, 20 వేల అగ్గిపెట్టెలు పంపించినట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు పిలుపుమేరకు జిల్లా నుంచి 4500 క్వింటాళ్ల బియ్యాన్ని బాధితులకు పంపించామని తెలిపారు.18 వేల బియ్యం బస్తాలను ఒక్కొక్కకి 25 కేజీల బస్తాలను 23 వాహనాల్లో విజయవాడ పంపించామన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి రూ.5 లక్షల విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శిమంత్రి నారా లోకేశ్‌ను గురువారం కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వాసును లోకేశ్ అభినందించారు. ఆదిరెడ్డి వాసుతో పాటు అమలాపురం ఎంపీ గంటి హరీష్ ఉన్నారు.



నిడదవోలు ఎఫ్‌సీఐ గొడౌన్ నుంచి..

నిడదవోలు, సెప్టెంబరు 5 : నిడదవోలు ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నుంచి విజయవాడ వరద బాధిత కుటుంబాలకు గురువారం బియ్యం లారీని పం పా రు. సీఎం చంద్రబాబు నాయుడు విజయ వాడ వర ద బాధితులకు ఒక్కో కుంటుంబానికి 25 కేజీల బి య్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో గురు వారం లారీని జేసీ చిన్నరాముడు పంపారు.



ఖైదీల పెద్ద మనసు..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్ర కారాగార ఖైదీలు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. జైలు పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ నేతృత్వంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం 25వేల టమాటా బాత్ ప్యాకెట్లను సిద్ధం చేసి గురువారం తెల్లవారుజామున విజయవాడకు పంపించారు. రాహుల్ మాట్లాడుతూ ఖైదీలే శ్రమించి స్వయంగా తయారు చేసిన టమాటా బాత్‌ని 300 గ్రాముల చొప్పున పొట్లాలుగా ప్యాక్ చేసి పంపారన్నారు.తమకు బాధితులను ఆదుకొనే అవకాశం ఇచ్చిన కలెక్టర్ ప్రశాంతి, జైళ్ల శాఖ డీజీ కుమార్‌విశ్వజిత్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గంగా స్నేహభావంతో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక న్యాయపీఠాల ద్వారా ఉదయం 10 గంటల నుంచి కేసులను విచారిస్తారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదిని నియమించుకొనే అవకాశం లేనివారు నేరుగా కోర్టు అవరణలో ఉండే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే సహాయం చేస్తారని, ఎలాంటి ఖర్చు ఉండదని చెప్పారు. కేసు పరిష్కారం అయిన తర్వాత ఇరు పక్షాలనూ విజేతలుగానే భావిస్తారు. అందువల్ల ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన ఉండదన్నారు. లోక్ అదాలత్ అవార్డు(తీర్పు)పై అత్యంత ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప అప్పీల్ చేసుకొనే అవకాశం కూడా లేదన్నారు. రాజీకి యోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోడానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని పీడీజే పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని కక్షిదారులు వినియోగించుకోవాలని..సందేహాలుంటే న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు.

తండ్రి కళ్లెదుటే.. కుమారుడి మృతి 7

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉన్నతమైనది గురువుల స్థానం

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లాలో 70 మందికి అవార్డులు
- విద్యార్థి ఎదుగుదలపై టీచర్ ప్రభావం
- గురువులను సత్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో గురువులది ఉన్నతస్థానమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి విజయం వెనుక వారిని తీర్చిదిద్దిన వ్యక్తిగా ఉపాధ్యాయుడు నిలుస్తారని కలెక్టర్ ప్రశాంతి కొనియాడారు. జిల్లా స్థాయి గురుపూజోత్సవ వేడుకలను గురువారం ఆనం కళాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరడం వెనుక ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుందని కలెక్టర్ అన్నారు. చెడు మార్గం వైపు వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేవాడు గురువేనన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రతిభావంతులుగా మలచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిలోనూ ఏదోక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి సానబట్టి సమాజా నికి మెరుగైన పౌరులను అందించాలని పిలుపునిచ్చారు. అడిషనల్ ఎస్పీ పి.సుబ్బరాజు మాట్లాడుతూ గురువు అనే మూడు అక్షరాలు ఎప్పటికీ మరిచిపోలేనివన్నారు. అప్పట్లో ఉపాధ్యాయుల మొప్పు పొందాలని, వారి నుంచి ప్రసంశలు అందుకోవాలని పోటీ పడి చదివే వాళ్లమని బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను తొలుతగా ఉపాధ్యాయుడిగా పనిచేసి 2007లో గ్రూప్- 1లో విజ యం సాధించి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. విద్యా ర్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపా ధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. డీఈవో కె.వాసు దేవరావు మాట్లాడుతూ ఎవరు ఎంత స్థాయికి ఎదిగినా గురువునే తలుచుకుంటూ ఉంటారన్నారు. సమాజంలో గురువు స్థానం అత్యున్నమైనదన్నారు. వ్యక్తులను ప్రభావితం చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి తప్ప మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీలు వి.వెం కట్రాజు, ఎ.ఛాయాదేవి,డీవైఈవో నారాయణ, ఎంఈవోలు దిలీప్‌కుమార్, తులసీదాస్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు వీరే

జిల్లాలోని 23 మంది ప్రధానోపాధ్యాయులు, 28 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక ఫిజికల్ ట్రైనింగ్ టీచర్, 18 మంది సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నారు.

హెచ్‌ఎంలు	స్కూల్ అసిస్టెంట్లు	సెకండ్ గ్రేడ్
ఆర్.విజయదుర్గ	ఎం.నాగార్జున	శాంతి అనురాధ
సీహెచ్ శ్రీనివాసరెడ్డి	పి.సత్యనారాయణ	తాళ్ల నారాయణరావు
పి.రవీంద్రనాథ్	కెబి మధుశేఖర్	కె.ఝాన్సీరావణి
ఎస్‌వీవీ.సత్యనారాయణ	మద్దాల అప్పారావు	సబ్బతి శ్రీనివాస్
వీపీ.మోహన్‌రావు	సుదాని విజయశ్రీ	వి.కృపావతి
టీ.సత్యనారాయణ	ఆరుగొల్లి జోగిరాజు	రెడ్డి నాగేశ్వరరావు
కేవీ సత్యనారాయణ	షేక్ వలి	వివిఎస్ మార్టిన్ లూథర్
ఆర్ పద్మశ్రీ	జెఎస్ఎస్.విజయప్రసాద్	ఎస్.కృష్ణ కుమారి
జి.శ్రీనివాసమూర్తి	ఆర్.హేమంత్ కుమార్	వివిఎస్ భాస్కరరెడ్డి
టీ.చక్రధర్	బూర సమాధానం	డీవీవీఎస్‌వీ ప్రసాద్
ఎస్.మేరీ పెరల్స్	ఎంఎస్ఎన్ మాణిక్యాంబ	కె.శాంతారావు
బి.రాజేశ్వరి	వి.సత్యనారాయణ మూర్తి	బి.చైతన్య కుమార్
జీవీవీఎస్.సీతారామయ్య	పి.హేమంత్ కుమార్	టీఎస్ సరోజాదేవి
డి.అరుణ	ఎస్‌డీ సుందరం జేమ్స్	డీఎస్ఎస్ మూర్తి
ఎస్.ఉషారాణి	ఎ.పద్మలత	కేవీఎస్ఎల్ నరసింహాంబ
చీమల నాగేంద్రరావు	ఏఎల్ నరసింహారావు	పీఎస్ దుర్గాభవాని
దూలం పద్మ సుజాత	అంజూరి సూరిబాబు	బీ.విజయలక్ష్మీ
వి.విజయకుమారి	బోను శ్యామల దేవి	ఎల్ఎన్‌వీబీఆర్ మూర్తి
రేగాని రామకృష్ణ	ఎండీ ఇబ్రహీం కలిదిల్లా	కంచెట్టి వీర వెంకట రావు (ఫిజికల్ ట్రైనింగ్ టీచర్)
బి.శ్రీనివాసరావు	ఆర్.ప్రతాపరెడ్డి	
తోట మరియదాసు	వి.వెంకట రమణ	
వీడీ ప్రసాదరావు	యు.సుబ్బారావు	
నక్కిన సాయిబాబు	వి.సురేశ్‌బాబు	
	వై.బాబురావు	
	సీహెచ్ విజయరత్నం	
	డి.రాజమ్మాయి	
	పీకేర్ల సుభాషిణి	
	సీహెచ్‌వీ కృష్ణప్రసాద్	



సర్వేపల్లి చిత్రపటం వద్ద కలెక్టర్, డీఈవో నివాళులు



టీచర్లకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే నల్లమిల్లి



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లికి జ్ఞాపికలు అందజేత



రారా కృష్ణయ్యా.. అంటూ విద్యార్థినుల నృత్యాభినయం



మొబైల్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని చూపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కారుపాటి వివేకానంద, సోమువీర్రాజు తదితరులు

ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయండి

అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 5 : జగన్మోహనరెడ్డి పార్టీకి రాష్ట్రంలో స్థానం లేదని, అనేక మంది వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాజమహేంద్రవరం బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయపార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, మాజీ మంత్రి కారుపాటి వివేకానంద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

65 ఏళ్లుగా మట్టి గణపతే

డఫేదారు నూతి సెంటర్లో ఉత్సవాల ప్రత్యేకత



రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 9: రామచంద్రపురం పట్టణంలోని డఫేదారు నూతి సెంటర్లో గణపతి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. 1960 నుంచీ బాలభక్త సమాజం ఇక్కడ మట్టి గణపతిని మాత్రమే ప్రతిష్ఠించి పూజలు చేస్తోంది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు నీతూకుమారి ప్రసాద్ రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు అందజేశారు. 2009లో స్వర్ణోత్సవాలు, 2019లో షష్టి పూర్తి మహోత్సవాలు జరిపారు. తాపేశ్వరం సురుచి స్వీట్స్ అధినేత మల్లిబాబు 50 ఏళ్లుగా ఏడాదికి కిలో వంతున పెంచుతూ లడ్డూ అందజేస్తున్నారు. ఈ ఏడాది 65 కిలోల లడ్డూ అందజేయనున్నారు.

2009లో స్వర్ణోత్సవాల అనంతరం గణపతి మాలధారణ చేసిన భక్తులు చవితి ఉత్సవాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 20 మంది భక్తులు గణపతి మాలధారణ చేశారు. అన్నదానం కూడా జరపనున్నారు. భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బాలభక్త సమాజం సభ్యులు చెప్పారు.

నారికేళ ప్రియుడు అయినవిల్లి సిద్ధి వినాయకుడు



అయినవిల్లి, సెప్టెంబరు 5: సకల దేవతా గణాలకు అధిపతి, విఘ్నాలను తొలగించే విఘ్నాధిపతి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి. ఒక్క నారికేళం సమర్పించినంతనే కోరిన కోర్కెలు తీర్చే స్వామి సిద్ధి వినాయకుడు. స్వయంభువుగా వెలసిన గణపతి క్షేత్రాల్లో ప్రత్యేకత గల ఆలయం ఇది. గోదావరి, గౌతమి తీరాన పచ్చని పంట పొలాలు, కొబ్బరి తోటల నడుమ అందాల కోనసీమలో అయినవిల్లి గ్రామంలో కొలువైయున్నాడు ఈ స్వామి. స్వర్ణ గణపతి యజ్ఞం నుంచి ఉద్భవించి దక్షిణాభిముఖుడిగా తూర్పు వైపునకు తొండము తిరిగి, తొండముతో వామహస్తమున మోదకము, దక్షిణ హస్తమున అభయస్త ముద్రతో చూడముచ్చటైన ఉదరముతోభక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. అతి చిన్న ప్రాంగణం, నాలుగు మాడ వీధులు, ప్రాకార మండపం, తూర్పు, దక్షిణ రాజగోపురాలతో చూడచక్కని అందాలతో అలరారుతోందీ క్షేత్రం. దక్ష ప్రజాపతి యజ్ఞ ప్రారంభంలో విఘ్నేశ్వర స్వామి ఆరాధన చేయకుండా శిరీశ్వర యాగం ప్రారంభించినందుకు శివుని ఆగ్రహానికి గురై యజ్ఞ భంగం జరిగింది. యజ్ఞభంగం కలగడం మానవాళికి మంచిదికాదని దేవతలు మహావిష్ణువును ప్రార్థించగా దేవతల సూచనల మేరకు దక్ష ప్రజాపతి అయినవిల్లి స్వయంభు గణపతి క్షేత్రానికి విచ్చేసి గణపతి ఆరాధన చేసి తదుపరి యజ్ఞం పూర్తి చేసినట్టు పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి.

ఇసుకతో వినాయకుడు...



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాల నాగేశ్వరరావు ఇసుకతో చిన్న సైజు వినాయకుడిని చేశాడు. గోదావరిలో సేకరించిన ఇసుకకు తేనె పట్టు, మైనం జత చేసి దారంతో పాటు వెదురుబద్దలను ఉపయోగించి సుమారు ఏడు గంటల పాటు శ్రమించి గణపతిని తయారు చేశాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన విగ్రహాలు వద్దు... మట్టి విగ్రహాలే ముద్దు అని... అందుకే తాను ఇసుకతో విగ్రహం తయారు చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు.

- మండపేట

చెవిలో చెబితే చాలు కోర్కెలు తీర్చే

బిక్కవోలు వినాయకుడు



బిక్కవోలు, సెప్టెంబరు 5: ప్రాచీన ఆలయాలకు పుట్టినిల్లుగా భాసిల్లే బిక్కవోలులో ఆది దేవునిగా భక్తుల పూజలందుకుంటున్నాడు స్వయంభూ వినాయకుడు. ఈ స్వామి చెవిలో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పంట పొలాల్లో ఈ వినాయకుని విగ్రహం బయల్పడింది. 9వ దశాబ్దానికి చెందిన ఏకశిల విగ్రహమని పురావస్తు శాఖ పరిశీలనలో వెల్లడైంది. పశ్చిమ చాళుక్యుల తర్వాత బిక్కవోలును రాజధానిగా చేసుకుని 9వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పాలించారు. వారు యుద్ధాలకు వెళ్లే ముందు ఈ వినాయకుడికి పూజలు చేసి వెళ్లి విజయం సాధించేవారు. కాలక్రమేణా తురుష్కులు, పిండారీలు, మహ్మదీయుల దండయాత్రల్లో ఈ విగ్రహం భూమిలోకి కూరుకుపోయిందన్న ప్రచారం కూడా వాడుకలో వుంది. అయితే 1960 దశకంలో బిక్కవోలుకు చెందిన ఒక భక్తుని కలలో వినాయకుడు కనిపించి తన ఉనికిని తెలిపాడని ప్రతీతి. నిరుపేద అయిన ఆ భక్తుడు గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేయగా.... ఎంత తవ్వినా విగ్రహం మొదలు కానరాలేదు. దీంతో అలాగే భక్తులు స్వామిని పూజించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం విగ్రహం పది అడుగుల ఎత్తు, ఆరడగుల వెడల్పు వుంది. ఈ స్వామికి తొండం కుడివైపునకు వుండడంతో భక్తుల మనసులోని ఏ కోరికనైనా స్వామికి చెవిలో చెబితే తప్పక నెరవేరుతుందని విశ్వాసం.

చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు: సాయిబాబారెడ్డి



ఈ ఏడాది వినాయకచవితి ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు వేశామని, వర్షం వచ్చినా భక్తులు తడవకుండా పందిళ్లపై రేకు షెడ్డు నిర్మించామన్నారు. స్వామి దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం రాత్రి 1.59 గంటలకు తీర్థపు బిందె సేవ నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 7వ తేదీ ఉదయం 10.29 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి-మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 16 వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని, వచ్చే భక్తులందరికీ అన్నదాన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 16న మహాన్నదానంతో ఉత్సవాలు ముగిస్తామని వివరించారు. వినాయకచవితి సందర్భంగా ఆలయంలో ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు ప్రతిరోజూ శ్రీలక్ష్మీ గణపతి స్వామి మూలమంత్ర, జపతర్పణ నిర్వహిస్తామని అర్చకుడు గొల్లపల్లి చలపతిశర్మ చెప్పారు.

నేడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సమావేశం

స్థాయీ సంఘాల సమావేశాలు కూడా

భారీ వర్షాలు, వరదలే అజెండా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జడ్పీ పాలకవర్గం శుక్రవారం కొలువుదీరనుంది. ఉదయం 10.30 గంటల నుంచి కాకినాడ లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గల జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. జిల్లాను ముంచెత్తుతున్న భారీ వర్షాలు, వరదలపైనే ప్రధాన అజెండాగా చర్చ జరగనుంది. సమావేశంలో చర్చించేందుకు 41 శాఖలకు చెందిన అంశాలతో అజెండాను రూపొందించారు. ప్రధానంగా ఇరిగేషన్, రోడ్లు మీద గట్టిగా పట్టుబట్టడానికి జడ్పీటీసీలు సన్నద్ధమవుతున్నారు. పాడేరు, కోనసీమ జిల్లాల నుంచి జడ్పీటీసీలు ఎంతో వ్యయప్రయాసలతో సమావేశాలకు వస్తున్నారు. ప్రతి సమావేశంలోనూ వారి పరిధిలోని సమస్యలను ఏకరువు పెడుతున్నారు. నిధుల లేమి, కొందరు అధికారుల అలసత్వం వల్ల ఎటువంటి పనులూ జరగట్లేదని వాపోతున్నారు. స్వపక్షంలోనే విపక్షంగా జడ్పీటీసీలు గళం విప్పిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నైనా నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నారు. ఒకానొక సందర్భంలో జడ్పీకి రావాల్సిన ఆర్థిక సంఘ నిధులు విడుదల కాక పదవుల్లో ఎందుకు ఉన్నామా అనే అసహనం కూడా జడ్పీటీసీలు వ్యక్తం చేశారు. నిధులు లేక 20 నెలలకు పైగా గౌరవవేతనం చెల్లించలేని పరిస్థితిలో జడ్పీ కొట్టుమిట్టాడుతోంది. వీటన్నిటినీ కూటమి పాలకుల ముందుంచను న్నారు. అజెండాలో పొందుపరిచిన వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, జలవనరులు, మైక్రో ఇరిగేషన్, గృహ నిర్మాణం అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది.

వరద బాధితులకు భరోసా

రూ.11 లక్షలు విలువైన ఆహార పదార్థాలు అందజేసిన మంత్రి సుభాష్



చిట్టినగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), సెప్టెంబరు 5: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం ఉదయం సహాయక చర్యలు చేపట్టారు. రామచంద్రపురం నుంచి బుధవారం రాత్రి రూ.11 లక్షలు విలువ చేసే వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింకులు, టోన్డ్ పాల ప్యాకెట్లు, బేకరీ బన్నులు తీసుకువెళ్లారు. తనకు కేటాయించిన చిట్టినగర్, 33, 47. 64 డివిజన్లలో మంత్రి సుభాష్‌కు పర్యటించి ఆహార పదార్థాలను అందజేశారు. బాధితులను పరామర్శించి భరోసా కల్పించారు. సీఎం రేయింబవళ్లు కష్టపడుతున్నారని, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పలువురు ఉన్నారు.

వరద బాధితులకు ఒక్కరోజు అమ్మకాల మొత్తం విరాళం

'సురుచి' యజమాని మల్లిబాబు

మండపేట, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సురుచి సంస్థ యజమాని పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) ముందుకొచ్చారు. ఈ నెల 8వ తేదీన ఉభయ గోదావరి జిల్లాల్లో వున్న తమ ఏడు బ్రాంచిల్లో విక్రయాల ద్వారా వచ్చే మొత్తాన్ని సీఎం సహాయ నిధికి అందజేస్తామన్నారు. ఆదివారం వినియోగదారులు తమ సంస్థల్లో అధికంగా స్వీట్లు కొనుగోలు చేసి వరద బాధితుల సహాయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'కృష్ణా బాధితులకు గోదావరి సాయం' పేరుతో ఈ సాయం అందించాలని నిర్ణయించినట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో కేరళలో తుఫాన్ సమయంలో తమ సంస్థ తరఫున రూ.6లక్షలు విరాళం అందించామన్నారు. ఇప్పుడు విజయవాడ బాధితులకు బ్రెడ్, జామ్, పచ్చళ్లు అందించామన్నారు.

కిమ్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ

» కిలో బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు అపహరణ » రంగంలోకి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5: అనుక్షణం జన సంచారం ఉంటుంది. చుట్టూ సీసీ కెమెరాల నిఘా. అవుట్‌గేట్, ఇన్‌గేట్ వద్ద ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బంది. అయినప్పటికీ దర్జాగా దొంగలు లోపలికి వచ్చి వేంకటేశ్వరస్వామి ఆభరణాలను అపహరించుకుపోయారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ కామనగరువు పంచాయతీ పరిధిలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. గురువారం ఉదయం ఆలయం వద్దకు వచ్చిన అర్చకుడు వేదాంతం కేశవరామ్ తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. చోరీ జరిగినట్టు భావించి ఆసుపత్రి యాజమాన్యానికి సమాచారం అందించాడు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) నిర్మించారు. స్వామివారికి రూ.20.50 లక్షల విలువైన కిలో బంగారు, రెండు కిలోల వెండి ఆభరణాలను అలంకరించారు. చోరులు చాకచక్యంగా ఆలయ ప్రధాన ద్వారం తాళం తెరిచి దర్జాగా లోనికి వెళ్లి స్వామివారి ఆభరణాలను అపహరించారు. బయట ఉన్న స్వామివారి హుండీని పెకిలించి అక్కడికి సమీపంలోని కొంతదూరం తీసుకువెళ్లి దానిని పగులకొట్టి ఆసొమ్ములను కూడా అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. అర్చకుడు కేశవరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.





వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద క్లూస్ టీమ్ పరిశీలన... చోరీ జరిగిన విధానాన్ని పరిశీలిస్తున్న తాలూకా సీఐ వీరబాబు



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

ఉధృతంగా గోదావరి

» ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

» 10.04.528 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, సెప్టెంబరు 5: ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం ఉదయానికి నీటిమట్టం 10.60 అడుగుల వరకు చేరుకోగా 8.36 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరంవద్ద వద్ద గంటకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతున్న నీటిమట్టం గురువారం రాత్రి పదకొండు గంటలకు 11.9 అడుగులుగా నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 10,04,528 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఎగువన ఎస్ఆర్ఎస్‌పీ, కడెం, శ్రీపాద, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి మిగులు నీటిని విడుదల చేయడం వల్ల కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తుండడంతో పాటు తాలిపేరు నుంచి విడుదలైన వరద నీటితో మరలా భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతూ గురువారం సాయంత్రం ఐదు గంటలకు 45.50 అడుగులకు చేరుకుంది. ఆపై తగ్గుతూ రాత్రి 11 గంటలకు 44 అడుగులుగా నమోదైంది.

అయినవిల్లి సిద్ధి వినాయకుని హుండీల ఆదాయం రూ.15.07 లక్షలు



అయినవిల్లి, సెప్టెంబరు 5: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 41 రోజులకు ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.14,60,055, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.47,061.. మొత్తం రూ.15,07,116 వచ్చింది. లెక్కింపులో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా కానిది... రెండు రోజుల్లో

సింగంపల్లిలో వినియోగంలోకి ఆర్వో ప్లాంటు



ఆర్వో ప్లాంటు వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 5: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలోని సింగంపల్లి గ్రామస్తుల తాగునీటి సమస్యపై 'వరద నీరే... తాగు నీరై' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెండేళ్లుగా పని చేయని ఆర్వో ప్లాంటుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. తంటికొండ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు రెండు రోజులు గ్రామంలోనే దగ్గరుండి బాగు చేయించారు. దీంతో గ్రామస్తులు గురువారం సాయంత్రం ఆర్వో ప్లాంటు వద్ద తాగునీటిని పట్టుకున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు దారుణం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: మండపేట మండలం ద్వారపూడిలో దళితులు, ముస్లింలు కలిసి ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం చాలా దారుణమని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎల్‌బీ శాస్త్రి రోడ్డులోని నివాసంలో పోలీసులు తనను గృహ నిర్బంధం చేయడంపై ఆయన మండిపడ్డారు. అనంతరం హర్షకుమార్ విలేకరులతో మాట్లాడారు. ద్వారపూడిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే దానిని స్పెషల్ పార్టీ పోలీసులు తొలగించడం దారుణమన్నారు. విగ్రహం తొలగింపును వ్యతిరేకించిన మాల, మాదిగలపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. లాఠీచార్జిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు బయల్దేరిన తనను గృహ నిర్బంధం చేయడం తగదన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి నిలబెట్టాలని డిమాండ్ చేశారు.

తండ్రి కళ్లెదుటే ఘోరం

టాటా ఏస్ వ్యాను ఢీకొని రెండేళ్ల బాలుడు మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం తాడిపూడిలో వ్యాను ఢీకొనడంతో రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపూడి గ్రామానికి చెందిన ఇర్లపాటి నరేష్ టెంట్‌హౌస్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం అతడి వద్ద పనిచేసే గూడపాటి బాబి సప్లై సామాన్లు తీసుకువెళ్లడానికి టాటా ఏస్ వ్యానుతో వచ్చాడు. అక్కడే ఆడుకుంటున్న నరేష్ కుమారుడు లాశ్విక్ (2)ను వ్యాను ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నరేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు లాశ్విక్ కళ్లెదుటే మృతి చెందడంతో ఆ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు లేడన్న విషయం తెలుసుకుని తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



లాశ్విక్ (పాత చిత్రం)

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు అనిల్‌కుమార్

గోకవరం, సెప్టెంబరు 5: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల దుర్గాఅనిల్‌కుమార్ (21) పామాయిల్ గెలలు కోసేందుకు గురువారం తంటికొండ వచ్చాడు. తోటలో గెలలు నరికే క్రమంలో అనిల్‌కుమార్ చేతిలో ఉన్న గెడ ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై నేలపై కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు గమనించి అతడిని గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రతిరోజూ చుట్టుపక్కల ఉండే పనులకు వెళ్లేవాడని... మొదటిసారిగా గురువారం తంటికొండ వచ్చి మృత్యువాతపడ్డాడని సహచర కూలీలు ఆసుపత్రి వద్ద విలపించడం స్థానికులను కలిచివేసింది. ఈ ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు సమాచారం.



మోతుగూడెం-చింతూరు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టు

మన్యంలో వరుణుడి ప్రతాపం

మోతుగూడెం, సెప్టెంబరు 5: వరుణుడి ప్రతాపానికి మన్యం ఒక్కసారిగా అతలాకుతలమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం రాత్రి నుంచీ భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తెల్లవారుజామున నుంచే మోతుగూడెం-చింతూరు మార్గమధ్యంలో రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాలు, అంబులెన్స్ రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ ప్రయాణికులు చాలా ఇబ్బందిపడ్డారు. తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేసి సత్కరిస్తున్న పీవో సింహాచలం

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

రంపచోడవరం, సెప్టెంబరు 5: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరలో పదోన్నతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, ఎంఈవోలు రామకృష్ణ, పి.బాలుదొర, తాతబ్బాయి, టి.మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, సూరారెడ్డి, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

మోతుగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాముని ఉపాధ్యాయులు సన్మానించారు.

దేవీపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను పెద్దలు శాలువాలతో సత్కరించి అభినందించారు.



వై.రామవరం: పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులను విద్యార్థినులు ఘనంగా సత్కరించారు.



నిమ్మలగూడెం-కుయుగూరు మధ్య జాతీయ రహదారిపై నిలిచిన వరద నీరు

కొనసాగుతున్న వరద ఉధృతి

చింతూరు, సెప్టెంబరు 5: గోదావరి, శబరి నదుల ఉధృతి కొనసాగుతోంది. దీంతో మండలంలోని 22 గ్రామాల చుట్టూ వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా వెళ్లే 326వ జాతీయ రహదారిపై నిమ్మలగూడెం-కుయుగూరు నడుమ ప్రధాన రహదారిపై వరద నీరు చేరింది. పలు గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయి. చింతూరు-వర రామచంద్రపురం మండలాల నడుమ సోకిలేరు, చీకటివాగులతో పాటు చంద్రవంక, పూసువాగు, కుయుగూరు వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. సోకిలేరు ఉధృతితో నాటు పడవల వినియోగం ఆందోళనగా ఉందని నిర్వాహకులు వాపోతున్నారు. కాగా పూసువాగు బాగా ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు సమీపంలోని ఎర్రగొండ పాకలుకు చెందిన చదలపండరెడ్డి, సొందుల కన్నపరెడ్డి ఇళ్లు వరద నీటిలో నిండా మునిగాయి.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం: ఐటీడీఏ పీవో అపూర్వభరత్

వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలు అవస్థలు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. గురువారం ఆయన చింతూరు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద చుట్టుముట్టిన గ్రామాల్లో కూరగాయలు, తాగునీటి సరఫరా చేస్తామన్నారు. 90 మంది గర్భిణులను ఆసుపత్రులకు తరలించామన్నారు. పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో బాధితులు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం చేరవేసే సదుపాయం కల్పించామన్నారు.

ఎటపాక: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గి, పెరుగుతూ వస్తోంది. మండలంలోని మురుమూరు, నందిగామ, నెల్లిపాక గ్రామాల వద్ద భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించింది. దీంతో గురువారం సాయంత్రం నుంచి రాకపోకలు స్తంభించాయి. వీరాయిగూడెం, నెల్లిపాక గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచాయి. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కృష్ణవరం గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద రహదారిపై మోకాళ్ల లోతులో వరద నీరు ప్రవహించింది.

గోదావరి వరద నీటిలో వ్యక్తి గల్లంతు

వరరామచంద్రపురం, సెప్టెంబరు 5: మండలంలోని అడవివెంకన్నగూడెం-తుష్టివారిగూడెం గ్రామాల మధ్య గోదావరి వరద నీటిలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. తుష్టివారిగూడేనికి చెందిన కారం నాగేశ్వరరావు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ రాకపోవడంతో వరద ప్రవాహం దగ్గరకు వెళ్లి చూశారు. గట్టుపై ఆ వ్యక్తి దుస్తులు, చెప్పులు ఉండడంతో వెంటనే విషయాన్ని పోలీసులకు, తహసీల్దారుకు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లి ఇంజన్ బోటులో సాయంత్రం వరకు గాలించారు. అయినా ఆచూకీ తెలియ లేదని ఎస్ఐ సత్యనారాయణ, తహసీల్దారు సుబ్బారావు తెలిపారు. శుక్రవారం కూడా గాలింపు చర్యలు చేపడతామని చెప్పారు.

ఓంకార్ ట్రస్టు ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ



వరరామచంద్రపురం, సెప్టెంబరు 5: మండలంలో రహదారి సౌకర్యం లేని కొండరెడ్ల గ్రామాలైన చొక్కనపల్లి, చొక్కనపల్లిగుంపు, వడ్డిగుంపు, కల్తునూరు గ్రామాలకు పర్యాటక బోటులో వెళ్లి 250 వరద బాధిత కుటుంబాలకు ఓంకార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎటపాక సీఐ కన్నమ రాజు, టీడీపీ నాయకుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఎటపాక ఏఎస్ఐ రాధాకృష్ణ, హెచ్‌సీ నాగరాజు, టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య, నాయకులు ముత్యాల చంద్రశేఖర్, శంకర్, ఓంకార్ ట్రస్టు సభ్యులు సీహెచ్ రాజేష్, మహేంద్ర, సీహెచ్ రాజు, సోను, సలీమ్ పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఉల్లిపాయలు, బంగాళాదుంపలను శ్రీరామగిరి, కన్నాయిగూడెం గ్రామాల్లోని వరద బాధితులకు పంపిణీ చేశామని తహసీల్దారు సుబ్బారావు చెప్పారు

మానవత్వం చాటుకున్న జమాల్‌ఖాన్

కూనవరం, సెప్టెంబరు 5: గోదావరి వరదలకు ఉదయ్‌భాస్కర్ కాలనీకి చెందిన రెండు దళిత కుటుంబాల ఇళ్లు కొట్టుకుపోయాయి. ఒక్కో కుటుంబానికి ఇంటికి పైకప్పు రేకులు, రాడ్లు, ఇంటికి కావాల్సిన సామగ్రిని జమాల్ ఖాన్ అందజేశారు. నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, చందు, రసూల్, నోముల రామారావు పాల్గొన్నారు.

లడ్డూ విక్రయశాల ప్రారంభం

రంపచోడవరం, సెప్టెంబరు 5: మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల లడ్డూ ప్రసాదం విక్రయశాలను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గురువారం ప్రారంభించారు. ఆలయ అధికారి నారాయణరాజు, వేద పండితుడు సాయిరామశర్మ, అర్చకులు గోవర్ధనం, మణికంఠాచార్యులు, ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లిమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.



నన్నయ వర్సిటీలో నివాళులు

ఆచార్య దేవోభవ

- ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
- మాజీ రాష్ట్రపతికి పూలమాలలతో నివాళి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉపాధ్యాయులకు సత్కారం

రంగంపేట, సెప్టెంబరు 5: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు గురుపూజోత్సవం జరిపి పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చార్లెస్, ఓంప్రసాద్, విద్యాకమిటీ వైస్ ఛైర్మన్ పి.సత్యవేణి ప్రసంగించారు. అనంతరం తమ ఉపాధ్యాయుల పాత్రలను పోషించారు. ఇదిలా ఉండగా గురుపూజోత్సవం సందర్భంగా వడిశలేరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ, ముకుందవరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు యనమదల బాబూరావు, గోవిందరాజపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బెల్లపు విజయలక్ష్మీ, పాతకోటపాడు ప్రాథమికోన్నత పాఠశాల చెవ్వాకుల విజయరత్నం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయి కార్యక్రమంలో వారు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డీఈవో కె.వాసుదేవరావు చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఎస్ఎంసీ చైర్మన్, కార్యవర్గ సభ్యులు, సహోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ధవళేశ్వరం: స్థానిక భవిత సెంటర్‌లో ఐఆర్‌టీ టీచర్లను ఘనంగా సత్కరించారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఐఆర్‌టీ వి.విశ్వపతిని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.పోసికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మానసిక దివ్యాంగ పిల్లలకు ఓర్పుతో నేర్పుతో విద్యనందిస్తున్న టీచర్లను, సిబ్బందిని సత్కరించారు.

గోకవరం: సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో స్థానిక రాజా పబ్లిక్ స్కూల్ అధినేత పట్నాల సూర్యప్రకాశరావును సత్కరించారు. సమితి నిర్వాహకులు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి అడుగుజాడల్లో నడిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు.

దివాన్‌చెరువు: రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్యా భవన్స్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ప్రాంతీయ విద్యాధికారి జేఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. అనంతరం తమ ఉపాధ్యాయుల పాత్రలను పోషించారు. ఉపాధ్యాయులందరికీ ఆటలపోటీలు నిర్వహించారు. అలాగే లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీలోని జననీ సంస్థలో ఉపాధ్యాయులను దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు సత్కరించి బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించారు.



అనపర్తి: పొలమూరులో ఉపాధ్యాయురాలు విజయదుర్గను సత్కరిస్తున్న దృశ్యం

అనపర్తి: పొలమూరులోని ద్వారంపూడి నారాయణరెడ్డి ఆడిటోరియంలో మండల స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. చిన్నారుల అభిరుచికి అనుగుణంగా వారి విద్య సాగాలని దీనికి తల్లిదండ్రులతో బాటు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. విద్యాదాతల సహకారంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎనిమిది హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పుష్పలత, నల్లమిల్లి సత్తిరెడ్డి, సర్పంచ్‌లు హేమతులసి, గంగాభవాని, విద్యాదాతలు ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో గంగరాజు కాపును సత్కరిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)లో నిర్వహించిన ఆచార్య దేవోభవ కార్యక్రమానికి చాన్సలర్, చైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మహోన్నత స్థానం ఉందన్నారు. గైట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత స్థాయి రాష్ట్రపతి పదవిని అలంకరించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ఆర్ఎస్ రాజు, కెవి రామరాజు, డీన్ ఎన్.లీలావతి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. అలాగే తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి, కానవరంలో గాయత్రీ విద్యాసంస్థలు, రాజానగరంలోని దివ్య విద్యాసంస్థల్లో కళాశాలల ఛైర్మన్లు వీవీవీఎస్ఎన్ మూర్తి, బర్ల సత్యనారాయణ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తిలో సర్వేపల్లి చేసిన విశేష కృషిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: జేగురుపాడు జీవీకే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ వనమాలి వెంకట బాలాజీ, నాయకులు పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, కర్రి చినబాబు, మర్రెడ్డి రమేష్, కుత్తుత్తి ఫణి, గంగరాజు రమణ, వనమాలి వీరకృష్ణ, చింతలపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

కోరుకొండ: మండలానికి చెందిన ఐదుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. కాపవరం ప్రాథమిక పాఠశాల నుంచి వి.కృపావతి, మధురుపూడి పాఠశాల నుంచి ఆర్.నాగేశ్వరరావు, కోటికేశవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కేవీ సత్యనారాయణ, గుమ్ములూరు హైస్కూల్ నుంచి ఆర్.హేమంత్‌కుమార్, కోటికేశరం జడ్పీ హైస్కూల్ నుంచి వి.సమాధానం ఉన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.



రంగంపేట హైస్కూల్లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ సభకు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు విచ్చేసి మాట్లాడారు. గురువులకు మనం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. ప్రిన్సిపాల్ రాజబాబు మాట్లాడుతూ సంస్కారవంతమైన విద్య ఎప్పుడూ విద్యార్థికి ఉన్నత బాటను వేస్తుందన్నారు. వెంకటేశ్వర నగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్‌ని సన్మానించారు. ఆదిత్య డిగ్రీకళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జీవీఎస్.నాగేశ్వరరావు, బీహెచ్.రమాదేవిలను ఎస్పీ గంగిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెనికేటి గంగాధరరావు, దొండపాటి సత్యంబాబు, రేలంగి రఘుబాబు, సిరా గంగాధరరావు, కొప్పిశెట్టి సూర్యచంద్ర, సూపరింటెండెంట్ బీహెచ్‌వీఎస్.మూర్తి, ఆదిత్య ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కే రెహమాన్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: వాకర్స్‌యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తమోపాధ్యాయులు కాసా జయప్రద (రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్) దంపతులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొత్తపల్లి వీర్రాజు, రిటైర్డ్ లెక్చరర్ బొమ్మరాజు అనురాధ, రిటైర్డ్ టీచర్ రాళ్ళబండి సత్యవాణిలను ఘనంగా సత్కరించారు. తొలుత క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, అధ్యక్షుడు సూరపురెడ్డి తాతారావు.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.కార్యక్రమంలో భేరి రత్నాంబ, పొట్లూరి రామబ్రహ్మం, గీసాల బాపూజీ, శీలం రామకృష్ణ, ఉప్పులూరి కాశీ విశ్వనాథం, ఆదిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు. కాగా టీచర్స్ డే సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయంలో కోరుకొండ మండలానికి చెందిన గంగరాజు కాపు మాస్టారును ఘనంగా సత్కరించారు. జిల్లా స్థాయిలో గంగరాజు అందించిన సేవలను గుర్తిస్తూ అయన్ను డీఈవో వాసుదేవరావు, ఎస్‌బీఐ జీఎం, ఆర్ఎంలు సత్కరించి అవార్డును అందించారు.

విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలి

నన్నయ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 5: విద్యార్థులకు గురువులు మార్గదర్శకంగా ఉండాలని, వారి ఉన్నతిని కోరుకోవాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వీసీ పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తినుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లిని గురువులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాత్ర కీలకమైనదని, మహనీయుల ఆశయసాధనకు అనుగుణంగా సమాజశ్రేయస్సు కోసం గురువులంతా కృషిచేయాలని సూచించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంనుంచి సన్మానం పొందిన నన్నయ వర్సిటీ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి తదితరలు పాల్గొన్నారు.

సాయం చేసిన చేతులు..

- వరద బాధితులకు ఆహార ప్యాకెట్ల తరలింపు

రాజానగరం, సెప్టెంబరు 5: విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద ముంపులో చిక్కుకున్న వారికి పలువురు దాతలు సహాయం అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో రాజానగరం మండల పరిషత్ తరపున 2500 ఆహార ప్యాకెట్లను గురువారం తరలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తోట రామకృష్ణ, మండారపు వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విజయవాడ వాంబే కాలనీలో 60వ డివిజన్ ప్రాంతంలో బాధితులను టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులను పలకరిస్తూ, వారిలో మనోధైర్యాన్ని నింపి, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను బాధితులు అందజేశారు. ఆయన వెంట తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు,అబ్జర్వర్ కొత్తపల్లి ఆశిష్‌లాల్ తదితరులున్నారు.

ఎన్ఎంఈ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో..

ధవళేశ్వరం, సెప్టెంబరు 5: వరద బాధితుల కోసం స్థానిక ఎన్ఎంఈ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో 2700 ఆహార ప్యాకెట్లను సిద్ధం చేసి కలెక్టర్ పి.ప్రశాంతి సూచనలతో రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన వాహనం ద్వారా విజయవాడ తరలించారు. ఈ సందర్భంగా త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొనాలని పాస్టర్ అనీల్‌కిరణ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జె.ప్రవీణ్. వి.రోహిణి, వి.జ్యోషిబాయి, ఆర్.మణి, వి.రాజేశ్వరరావు, వి.కుమార్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడియం మండల పరిషత్ నుంచి 2,500 ఆహార పొట్లాలు

కడియం, సెప్టెంబరు 5: కడియం మండల పరిషత్ తరుపున 2,500 ఆహార పొట్లాలను విజయవాడ పంపించారు. వాహనాన్ని ఎంపీపీ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కెరత్నకుమారి, వెలుగుబంటి నాని, చెక్కపల్లి మురళి, ముద్రగడ జమీ, కలిదిండి గోవిందు, సూరపురెడ్డి జానకిరామయ్య మోసిగంటి ప్రసాద్, వనుం సూరిబాబు, పాల్గొన్నారు.



విజయవాడ బాధితులకు ఆహార పదార్థాలు అందజేస్తున్న బీవీఆర్

ముంపు ప్రాంతాల్లో టీడీపీ నాయకుల సేవలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నాయకులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. నాలుగు రోజులుగా అక్కడే ఉండి సేవలందిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి మజ్జి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, కుడుపూడి సత్తిబాబుతోపాటు మరో 50 మంది విజయవాడ వరద ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి సహాయం అందిస్తున్నారు.

300మంది పారిశుధ్య కార్మికుల తరలింపు.. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతానికి రాజమహేంద్రవరం నుంచి 300 మంది పారిశుధ్య కార్మికులను తరలించారు. బుధవారం తొలుత 150 మందిని, గురువారం మరో 150 మందిని పంపించారు. విజయవాడలో వరద ముంపు తగ్గడంతో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వేగంగా పూర్తి చేసేందుకు అన్ని కార్పొరేషన్ల నుంచి పారిశుధ్య కార్మికులను తరలించారు.

పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తాం

సీతానగరం, సెప్టెంబరు 5: గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని ఇది మరింత పెరిగితే బొబ్బిల్లంక గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రత్యేకాధికారి వేదవల్లి, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ రామ్‌కుమార్‌లతో కలసి వారు ములకల్లంక గ్రామంలో పర్యటించారు. పారిశుధ్యం కార్యక్రమాలపై ఆరా తీసారు. తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలు అందించే నీటిలో క్లోరినైజేషన్ తప్పనిసరిగా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య శిబిరాల్లో కుక్క, పాముకాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ములకల్లంక వాసులను అక్కడి నుండి తరలించాలని ప్రయత్నించినా వారు అంగీకరించడం లేదన్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను తెలుసుకుంటూ చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

ఇద్దరు ముస్లిం విద్యార్థుల అదృశ్యం

రాజానగరం, సెప్టెంబరు 5: రాజానగరం పోలీస్ పరిధిలోని కొంతమూరు మదర్సా మసీదులో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు రెండు రోజుల నుంచి కనిపించడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిర్లంపూడి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన షేక్ సలీమ్(17), షేక్ యాసిన్(14) అను విద్యార్థులు మూడేళ్లుగా చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇద్దరూ విద్యార్థులు కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లేకపోవడంతో సలీమ్ తండ్రి అలీమా, యాసిన్ తండ్రి నాగు గురువారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

రేపు సృష్టి గణపతి ప్రతిష్ఠాపన

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 5: రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది సృష్టి గణపతి విగ్రహం ప్రతిష్ఠిస్తామని కమిటీ ప్రతినిధులు జక్కంపూడి విజయలక్ష్మి, చల్లా శంకరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 9.54 నిమిషాలకు సృష్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. కార్యక్రమంలో వాకచర్ల కృష్ణ, అడపా అనిల్, శ్రీకన్య భాను, ఇసుకపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుద్దాం

అనపర్తి, సెప్టెంబరు 5: బీజేపీ సభ్యత్వం స్వీకరించడం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రతిఒక్కరూ బలపరచాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పొలమూరులో శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కన్వీనర్ శివ రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. మొదటి సభ్యత్వాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కర్రి బులిరెడ్డి ఆధ్వర్యంలో 150మంది వైసీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏవీఆర్ చౌదరి, తాడి గంగిరెడ్డి, రామవరం, కుతుకులూరు, ఊలపల్లి సర్పంచ్‌లు గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, రమ్యసిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

రాజానగరం, సెప్టెంబరు 5: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ సమీపంలోని గురువారం సిమెంట్ లారీ బోల్తా పడింది. కోదాడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న సిమెంట్ లోడు లారీ మార్గమధ్యంలో జీఎస్ఎల్ సమీపంలో ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ముందు వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒక వైపునకు ఒరిగిపోయినట్టుగా తెలుస్తోంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అలాగే రహదారిపై వాహనాల రాకపోకలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

మట్టి గణపతులనే పూజించాలి

బిక్కవోలు, సెప్టెంబరు 5: వినాయక చవితికి ప్రతిఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని పందలపాక ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కె.రామ్మోహనరెడ్డి సూచించారు. గురువారం పాఠశాల విద్యార్థులు పీడీ యువరాజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంజనీ కుమార్, సప్పా శ్రీనివాస్, వెంకటరమణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లోని డీలర్లకు ధ్రువపత్రాలు

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 5: జిల్లా పరిధిలో 8వ బ్యాచ్‌గా వ్యవసాయ అనుబంధ రంగాల్లో డీలర్లగా వ్యవహరిస్తున్న40మందికి డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్ డీలర్స్ అర్హత ధ్రువపత్రాలు అందించినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. రాజమహేంద్రవరం స్టేడియం రోడ్‌లోని గంటా గనిరాజు కళ్యాణ మండపంలో 48 వారాలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో మెడికల్ షాపులు నిర్వహించే వారు ఏవిధంగా ఫార్మా ధ్రువపత్రం కలిగి ఉంటారో అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల్లో డీలర్లు కూడా తప్పనిసరిగా అర్హత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి, ఏడీలు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, జేఈ రామలక్ష్మి, ఫెసిలిటేటర్ సీతారామయ్య, రిటైర్డ్ జేడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కడియపులంక డ్వాక్రా సంఘాలపై విచారణ జరపాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు

కడియం, సెప్టెంబరు 5: కడియపులంక పంచాయతీలో 10 క్లస్టర్ల పరిధిలోని కడియపులంక, బుర్రిలంక వెంకయ్యపేటలో సుమారు 30 మహిళా సంఘాలు ఉన్నాయని, వాటిపై విచారణ చేస్తే పలు అవకతవకలు బయటపడే అవకాశం ఉందని సర్పంచ్-ఇన్‌చార్జి రాంజీ అన్నారు. ఈ మేరకు గురువారం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తిని సర్పంచ్-ఇన్‌చార్జి రాంజీతో పాటు, వార్డు మెంబర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. కడియపులంకలో డ్వాక్రా సంఘాల రుణాలకు సంబంధించి బ్యాంకు వాయిదాల చెల్లింపు విషయంలో వీవోఏలు అవకతవకలకు పాల్పడ్డారంటూ పలువురు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేపట్టాలని రాంజీ కోరారు. మూడు సంఘాలకు సంబంధించి లక్షలాది రూపాయలు గోల్‌మాల్ చేసారని డ్వాక్రా సంఘ సభ్యులు ఆరోపించారన్నారు. 20 నెలలుగా పలు సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను జమ చేయకపోయినా బ్యాంకు, వెలుగు అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో బోడపాటి రాజేశ్వరి, కట్టా శివ, గట్టి చంద్రాదేవి తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వెర్టర్ల అందజేత

గోకవరం, సెప్టెంబరు 5: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలకు దాత, టీడీపీ సీనియర్ నాయకుడు గాజింగం సత్తిబాబు ఇన్వెర్టర్లను సమకూర్చారు. పాఠశాల విద్యార్థులకు డార్మెటరీలో ఎటువంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సుమారు రూ.2.50లక్షల విలువైన ఇన్వెర్టర్లను గురువారం పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ గళ్లా రాము, నాయకులు అడపా భరత్, అర్జునరావు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతానగరం, సెప్టెంబరు 5: పురుషోత్తపట్నం శివారు రామచందరపురం సమీపంలో సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ గురువారం తెలిపారు. తమ వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి మోటార్‌సైకిల్‌పై సారా తరలిస్తుండగా రామచంద్రపురం గ్రామానికి చెందిన చిట్టూరి శ్రీనివాసరావు, గెడ్డం చిన్న వెంకటరత్నంలను పట్టుకుని అరెస్టు చేసి వారి నుంచి 50 లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనము చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. నిందితులను రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎల్ఐసీలో ఆరోగ్య అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 5: ప్రతి మనిషి వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తే అకాల మరణాలను నివారించవచ్చని జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. మోరంపూడిలోని ఎల్ఐసీ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎల్ఐసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ఏటా వైద్య పరీక్షలు చేయించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. డెల్టా హాస్పిటల్ డాక్టర్లు శివకృష్ణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్థ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి వైద్య సేవలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. వరద



వచ్చేస్తోంది : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి



ఉగ్రగోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద సుడులు తిరుగుతున్న గోదావరి

గోదావరి ఉరుకులు..పరుగులు

- ధవళేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక
- అంతకంతకూ పెరుగుతున్న వరద
- దిగువకు 10,04,528 క్యూసెక్కులు
- విజయవాడ ఘటనతో ఆందోళన
- భయం..భయంగా జనం
- భద్రాచలం వద్ద తగ్గుముఖం

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూ రు :గోదావరి వరదంటే భయమేస్తోంది. కృష్ణానది, బుడ మలేరు ప్రభావం కారణంగా విజయవాడలో లక్షలాది మంది కష్టాలు చూస్తున్న జనం వణికిపోతున్నారు. అఖండ గోదావరి వరకూ పెద్దగా ఇబ్బంది లేదని భావిస్తుంటారు..నిన్నటి వరకూ బెజవాడ ప్రజలదీ అదే ధైర్యం..కానీ ఒక్కసారిగా మునిగే సరికి కష్టాలను చూస్తున్నారు. ఇదిలా ఉండగా నిన్నటి వరకూ ప్రశాంతంగా కనిపించిన గోదావరి మళ్లీ ఉగ్ర రూపం దాల్చుతుంది. ఉరుకులు.. పరుగులు పెడుతుంది.. నిన్నటి వరకూ ప్రశాంతంగా కనిపించిన గోదావరి ఒక్క సారిగా పెరిగింది. ఎప్పుడూ ప్రశాంతంగా ప్రవహించే అఖండ గోదావరి తన సహజత్వానికి విరుద్ధంగా సుడులు తిరుగుతూ ప్రమాదకరంగా ప్రవహి స్తుంది. దీంతో జనం భయపడుతున్నారు.. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలను వరద గోదావరి పూర్తిగా ముంచెత్తింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి 7 గంటల సమయంలో 45.50 అడుగులకు చేరింది. ఇది 11 గంటల సమయానికి 44 అడుగులకు చేరి తగ్గుముఖం పట్టింది.పోలవరం, రాజమహేంద్రవరం వద్ద అఖండగోదావరి ఉరకలేస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 11 గంటలకు నీటిమట్టం 11.90 అడుగులుగా ఉంది. పాండ్ లెవల్ 14.20 మీటర్లుగా ఉంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.డెల్టా కాలువలకు 1800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. ఇక బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10,04,528 క్యూసెక్కులు ప్రవాహం వెళుతోంది. ఇది కోనసీమ లంకలను ముంచుతూ సము ద్రంలోకి పోతోంది.ఈ నేపథ్యంలో ఎగువ నుంచి అధికంగా వస్తున్న వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అం చనా వేస్తూ ధవళేశ్వరం బ్యారేజీకి ఉన్న నాలుగు ఆరమ్‌ల లోని 175 గేట్లను పూర్తిగా ఎత్తివేసి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వద్ద ఉధృతి పెరిగింది. ఈ ఉధృతి మరో 24 గంటల పాటు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నా రు. భద్రాచలం వద్ద తగ్గడంతో అధికారులు ఊపిరిపీల్చుకు న్నారు. వరద ప్రవాహంతో నది ఉధృతంగా ప్రవహిస్తుండ డంతో నదిలో ఎవరు దిగరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.రెవెన్యూ సిబ్బంది,పట్టణ పోలీసులతో స్నాన ఘట్టాల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహశీల్దార్ కె. అజయ్‌బాబు రెవెన్యూ సిబ్బందితో కలిసి కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామం వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. మద్దూరులంక గ్రామంలోకి గోదావరి నుంచి వరద నీరు ప్రవే శించే మార్గాల్లో ఇసుక బస్తాలు వేశారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. వరద మరింత పెరిగితే మద్దూరులంక గ్రామ స్తులు పునరావాస కేంద్రానికి తరలిరావాలని సూ చించారు. మరోక పక్క ఎర్రకాలువ పొంగుతోంది.గత నెలలో ఎర్రకా లువ పొంగడం వల్ల నిడద వోలు,గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ పంట నష్టం జరిగిన సంగతి తెలి సిందే.కొవ్వాడకాలువకు నీరు చేరుతోంది.ముందస్తు జాగ్రత్తగా రాజమండ్రి అఖండగోదావరి లోని లంక ప్రజల కోసం రాజమండ్రిలో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలి పారు.జేసీ ఎస్. చినరాముడు ఎర్రకాలువ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు.



మద్దూరులంకలో గట్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

మందులు అందుబాటులో ఉంచుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు

సీతానగరం,సెప్టెంబరు 5 : గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున అన్ని రకాల మందులు వైద్య శిబిరాల్లో అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సీతానగరం మండలం బొబ్బిల్లంక పీహెచ్‌సీని గురువారం సందర్శించి తదుపరి గోదావరి వదర పరిస్థితిని పరిశీలించారు. కుక్క, పాము కాటు, మందులతో పాటు అన్ని రకాల మందులు పీహెచ్ సీలలో అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశిం చారు.సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న సర్వేను క్షేత్రస్థా యిలో పరిశీలించారు.ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై అడిగితెలుసుకున్నారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె. చైతన్య, ఏసురాణి, ఎంపీహెచ్ఈవోలు పాల్గొన్నారు..



ఎర్రకాల్వ వద్ద వివరాలు సేకరిస్తున్న జేసీ చిన్నరాముడు

ఉప్పొంగుతున్న ఎర్రకాల్వ

నిడదవోలు, సెప్టెంబరు 5 : ఎర్రకాల్వ ఉధృతి కారణంగా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామాల మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయని జేసీ ఎస్.చిన్నరాముడు గురువారం తెలిపారు.ఎర్రకాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గురువారం పరిశీలించారు.ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా ఎర్రకాల్వ ఉధృతంగా ప్రవహిస్తుందని తెలిపారు.కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు తెలిపారు.కంసాలిపాలెం మార్గంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.ఆయన వెంట తహశీల్దార్ బి.నాగరాజు నాయక్ అధికారులు ఉన్నారు.

విఘ్నాధిపతినీ..వదలరా!?

ఫార్మాలిటీ ఇస్తేనే సింగిల్ విండో అనుమతులు - కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

రాజమహేంద్రవరం సిటీ,సెప్టెంబరు 5 : కలెక్టర్ చెప్పినా.. ఎస్పీ చెప్పినా అధికారులు వింటారా.. ఎవరు చెప్పినా మామూళ్లు మామూలే.. ఎంతలా అలవాటు పడిపోయారంటే చివరికి దేవుడి దగ్గర భయంలేదు. వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన సంగతి తెలిసిందే.. కొన్ని శాఖల సిబ్బంది సింగిల్ విండో విధానానికే చెడ్డపేరుతెస్తున్నారు.చవితి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.ఈ మేరకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు అగ్నిమాపక, పోలీస్, కార్పొరేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.తీరా అనుమతులకు కమిటీలు సంబంధిత శాఖల కార్యాలయాలకు వెళితే అక్కడ అన్ని పార్మాలిటీలే. దీంతో కమిటీలు కంగుతింటున్నాయి. వాస్తవానికి రూల్ ప్రకారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ట్రెజరీలో రూ.1000 చలానా కట్టి దానిని తీసుకుని,అగ్నిమాపక శాఖ కార్యాలయానికి వెళ్లి అక్కడ రూ.500 చలానా కట్టి, బయట ఆన్‌లైన్ దార్వా మైక్‌కు రోజుకు రూ.100 చొప్పున చలానా కట్టి ఈ పేపర్లు తీసుకుని నోటరీ చేయించుకుని అన్నీ పట్టుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ పోలీస్ వారు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసుకుని అనుమతి పత్రాలు జారీ చేస్తారు.పోలీసులు నోటరీకి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడంలేదు.మామూళ్లు ఇస్తే మామూలే అంటున్నారు.ఫైర్ స్టేషన్‌లో రూ.500, పోలీస్ స్టేషన్‌లో రూ.500 లు చొప్పున మామూళ్లు (పార్మాలిటీ) తీసుకుంటున్నారని ఉత్సవాలు నిర్వహించే యువకులు గగ్గోలు పెడుతున్నారు. సగటున ఒక్కో కమిటీ రూ.వెయ్యి రూపాయలు అదనంగా వసూలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ చెప్పిన విధానానికి తూట్లు పొడుస్తూ కొంత మంది అనుసరిస్తున్న తీరుపై ఉత్సవ కమిటీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్మాలిటీలే ఎక్కువ కావడం శోచనీయం.



కోర్కెలు తీర్చే గణేశుడు

జై జై గణేశా.. జై కొడతాం గణేశా.. వరములివ్వు బొజ్జ గణేశా అంటూ.. చాలా మంది చవితి ఉత్సవాల్లో స్వామిని మొక్కుకుంటారు.. ఈ చిత్రంలోని విగ్రహం చూశారా.. ఏడాదంతా స్వామికి అదే పని.. ఎందుకంటే స్వామి చెవిలో కోర్కెలు చెప్పుకుంటే తీరుతుందని నమ్మకం.. ఈ విగ్రహం ఈ నాటికి కాదండోయ్ 9వ శతాబ్దానికి చెందినది .. ఎత్తు ఎంతో తెలుసా.. అక్షరాలా 10 అడుగులు.. స్వామి స్వయం భూగా వెలిశారు.. ఇంతకీ ఎక్కడ ఉందో తెలుసా.. మన జిల్లాలోని బిక్కవోలులో.. రేపటి నుంచి చవితి ఉత్సవాల ఆరంభం సందర్భంగా స్వామిని ఒకసారి దర్శించుకుందాం.. కోర్కెలు చెప్పుకుందాం.

మేమున్నాం..అండగా!



సీఎం సహాయనిధికి రూ.5 లక్షల చెక్ లోకేశ్‌కి అందజేస్తున్న రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

నాలుగో రోజునా ఆదుకున్నారు...

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5: రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు జిల్లా యంత్రాంగం ఉదయం అల్పాహారం 27,500 ప్యాకెట్లను పంపించారు. ఉదయం 14 వాహనాల్లో ఫుడ్ ప్యాకెట్లు, 50 వేల వాటర్ ప్యాకెట్లను పంపించినట్టు కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. 55 వాహనాలలో బియ్యం, ఆహార పదార్థాలు, పాలు, బిస్కెట్లు, రస్కులు, తాగునీరు పంపించారు.మధ్యాహ్నం భోజనాలకు 8 వాహనాల ద్వారా 23 వేల ఫుడ్ ప్యాకెట్లు పంపామని తెలిపారు. రాత్రి భోజనాలకు జిల్లా నుంచి 10 వాహనాల్లో 34,500 ఫుడ్ ప్యాకెట్లు , 17 వేల వాటర్ బాటిల్స్35 వేల బిస్కెట్ ప్యాకెట్లు ,20 వేల క్యాండిల్స్, 20 వేల అగ్గిపెట్టేలు పంపించినట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు పిలుపుమేరకు జిల్లా నుంచి 4500 క్వింటాళ్ల బియ్యాన్ని బాధితులకు పంపించామని తెలిపారు.18 వేల బియ్యం బస్తాలను ఒక్కొక్కకి 25 కేజీల బస్తాలను 23 వాహనాల్లో విజయవాడ పంపించామన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి రూ.5 లక్షల విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శిమంత్రి నారా లోకేశ్‌ను గురువారం కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే వాసును లోకేశ్ అభినందించారు. ఆదిరెడ్డి వాసుతో పాటు అమలాపురం ఎంపీ గంటి హరీష్ ఉన్నారు.



నిడదవోలు ఎఫ్‌సీఐ గొడౌన్ నుంచి..

నిడదవోలు, సెప్టెంబరు 5 : నిడదవోలు ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నుంచి విజయవాడ వరద బాధిత కుటుంబాలకు గురువారం బియ్యం లారీని పం పా రు. సీఎం చంద్రబాబు నాయుడు విజయ వాడ వర ద బాధితులకు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బి య్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో గురు వారం లారీని జేసీ చిన్నరాముడు పంపారు.



ఖైదీల పెద్ద మనసు..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్ర కారాగార ఖైదీలు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. జైలు పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ నేతృత్వంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం 25వేల టమాటా బాత్ ప్యాకెట్లను సిద్ధం చేసి గురువారం తెల్లవారుజామున విజయవాడకు పంపించారు. రాహుల్ మాట్లాడుతూ ఖైదీలే శ్రమించి స్వయంగా తయారు చేసిన టమాటా బాత్‌ని 300 గ్రాముల చొప్పున పొట్లాలుగా ప్యాక్ చేసి పంపారన్నారు.తమకు బాధితులను ఆదుకొనే అవకాశం ఇచ్చిన కలెక్టర్ ప్రశాంతి, జైళ్ల శాఖ డీజీ కుమార్‌విశ్వజిత్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గంగా స్నేహభావంతో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక న్యాయపీఠాల ద్వారా ఉదయం 10 గంటల నుంచి కేసులను విచారిస్తారన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదిని నియమించుకొనే అవకాశం లేనివారు నేరుగా కోర్టు అవరణలో ఉండే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే సహాయం చేస్తారని, ఎలాంటి ఖర్చూ ఉండదని చెప్పారు. కేసు పరిష్కారం అయిన తర్వాత ఇరు పక్షాలనూ విజేతలుగానే భావిస్తారు. అందువల్ల ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన ఉండదన్నారు. లోక్ అదాలత్ అవార్డు(తీర్పు)పై అత్యంత ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప అప్పీల్ చేసుకొనే అవకాశం కూడా లేదన్నారు. రాజీకి యోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోడానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని పీడీజే పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని కక్షిదారులు వినియోగించుకోవాలని..సందేహాలుంటే న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు.

40 మందికి అగ్రి సర్టిఫికెట్లు

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 5: జిల్లా పరిధిలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో డీలర్లగా వ్యవహరిస్తున్న 40 మందికి డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఇన్‌పుట్ డీలర్స్ అర్హత ధ్రువపత్రాలు అందించినట్టు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. రాజమహేంద్రవరం గంటా గనిరాజు కల్యాణ మండపంలో 48 వారాలు శిక్షణ పూర్తి చేసుకున్న 8వ బ్యాచ్‌కు ధ్రువీకరణ పత్రాల ప్రదానోత్సవం గురువారం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో డీలర్లు అర్హత పత్రం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఉన్నతమైనది గురువుల స్థానం

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లాలో 70 మందికి అవార్డులు
- విద్యార్థి ఎదుగుదలపై టీచర్ ప్రభావం
- గురువులను సత్కరించిన కలెక్టర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో గురువులది ఉన్నతస్థానమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి విజయం వెనుక వారిని తీర్చిదిద్దిన వ్యక్తిగా ఉపాధ్యాయుడు నిలుస్తారని కలెక్టర్ ప్రశాంతి కొనియాడారు. జిల్లా స్థాయి గురుపూజోత్సవ వేడుకలను గురువారం ఆనం కళాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరడం వెనుక ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుందని కలెక్టర్ అన్నారు. చెడు మార్గం వైపు వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేవాడు గురువేనన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రతిభావంతులుగా మలచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిలోనూ ఏదోక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి సానబట్టి సమాజా నికి మెరుగైన పౌరులను అందించాలని పిలుపునిచ్చారు. అడిషనల్ ఎస్పీ పి.సుబ్బరాజు మాట్లాడుతూ గురువు అనే మూడు అక్షరాలు ఎప్పటికీ మరిచిపోలేనివన్నారు. అప్పట్లో ఉపాధ్యాయుల మెప్పు పొందా లని, వారి నుంచి ప్రసంశలు అందుకోవాలని పోటీ పడి చదివే వాళ్లమని బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను తొలుతగా ఉపాధ్యాయుడిగా పనిచేసి 2007లో గ్రూప్- 1లో విజ యం సాధించి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. విద్యా ర్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపా ధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. డీఈవో కె.వాసు దేవరావు మాట్లాడుతూ ఎవరు ఎంత స్థాయికి ఎదిగినా గురువునే తలుచుకుంటూ ఉంటారన్నారు. సమాజంలో గురువు స్థానం అత్యున్నతమైనదన్నారు. వ్యక్తులను ప్రభావితం చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి తప్ప మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీలు వి.వెం కట్రాజు, ఎ.ఛాయాదేవి,డీవైఈవో నారాయణ, ఎంఈ వోలు దిలీప్‌కుమార్, తులసీదాస్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు వీరే

జిల్లాలోని 23 మంది ప్రధానోపాధ్యాయులు, 28 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక ఫిజికల్ ట్రైనింగ్ టీచర్, 18 మంది సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నారు.

హెచ్‌ఎంలు	స్కూల్ అసిస్టెంట్లు	సెకండ్ గ్రేడ్
ఆర్.విజయదుర్గ	ఎం.నాగార్జున	శాంతి అనురాధ
సీహెచ్ శ్రీనివాసరెడ్డి	పి.సత్యనారాయణ	తాళ్ల నారాయణరావు
పి.రవీంద్రనాథ్	కెవి మధుశేఖర్	కె.ఝాన్సీరావణి
ఎస్‌వీవీ.సత్యనారాయణ	మద్దాల అప్పారావు	సబ్బతి శ్రీనివాస్
వీపీ.మోహన్‌రావు	సుదాని విజయశ్రీ	వి.కృపావతి
టీ.సత్యనారాయణ	ఆరుగొల్లి జోగిరాజు	రెడ్డి నాగేశ్వరరావు
కేవీ సత్యనారాయణ	షేక్ వలి	విఎస్ మార్టిన్ లూథర్
ఆర్ పద్మశ్రీ	జెఎస్ఎస్.విజయప్రసాద్	ఎస్.కృష్ణ కుమారి
జి.శ్రీనివాసమూర్తి	ఆర్.హేమంత్ కుమార్	విఎస్ భాస్కరరెడ్డి
టీ.చక్రధర్	బూర సమాధానం	డీవీవీఎస్‌వీ ప్రసాద్
ఎస్.మేరీ పెరల్స్	ఎంఎస్ఎన్ మాణిక్యాంబ	కె.శాంతారావు
బి.రాజేశ్వరి	వి.సత్యనారాయణ మూర్తి	బి.చైతన్య కుమార్
జీవీవీఎస్.సీతారామయ్య	పి.హేమంత్ కుమార్	టీఎస్ సరోజాదేవి
డి.అరుణ	ఎస్‌డీ సుందరం జేమ్స్	డీఎస్ఎస్ మూర్తి
ఎస్.ఉషారాణి	ఎ.పద్మలత	కేవీఎస్ఎల్ నరసింహాంబ
చీమల నాగేంద్రరావు	ఏఎల్ నరసింహారావు	పీఎస్ దుర్గాభవాని
దూలం పద్మ సుజాత	అంజూరి సూరిబాబు	బీ.విజయలక్ష్మీ
వి.విజయకుమారి	బోసు శ్యామల దేవి	ఎల్ఎస్‌వీబీఆర్ మూర్తి
రేగాని రామకృష్ణ	ఎండీ ఇబ్రహీం కలిదిల్లా	కంచెట్టి వీర వెంకట రావు
బి.శ్రీనివాసరావు	ఆర్.ప్రతాపరెడ్డి	(ఫిజికల్ ట్రైనింగ్ టీచర్)
తోట మరియదాసు	వి.వెంకట రమణ	
వీడీ ప్రసాదరావు	యు.సుబ్బారావు	
నక్కిన సాయిబాబు	వి.సురేశ్‌బాబు	
	వై.బాబురావు	
	సీహెచ్ విజయరత్నం	
	డి.రాజమ్మాయి	
	పీకేర్ల సుభాషిణి	
	సీహెచ్‌వీ కృష్ణప్రసాద్	



సర్వేపల్లి చిత్రపటం వద్ద కలెక్టర్, డీఈవో నివాళులు



టీచర్లకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే నల్లమిల్లి



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లికి జ్ఞాపికలు అందజేత



రారా కృష్ణయ్యా.. అంటూ విద్యార్థినుల నృత్యాభినయం



మొబైల్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని చూపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కారుపాటి వివేకానంద, సోమువీర్రాజు తదితరులు

ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయండి

అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 5 : జగన్మోహనరెడ్డి పార్టీకి రాష్ట్రంలో స్థానం లేదని, అనేక మంది వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాజమహేంద్రవరం బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయపార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, మాజీ మంత్రి కారుపాటి వివేకానంద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా 11న నిరసన

మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యామ్


సమావేశంలో పాల్గొన్న మాల సంఘాల జేఏసీ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 5: వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 11న ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టినట్టు మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. కొవ్వూరు మెరకవీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద సాకా పుల్లారావు అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని, దానిని పునః పరిశీలించాలని కోరుతూ ఆలిండియా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదేరోజు కొవ్వూరులో నిరసన కార్యక్రమం చేపట్టాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసా ఆనంద్ మాట్లాడుతూ ఆర్టికల్ 341ని అనుసరించి ఒక కులాన్ని చేర్చాలన్నా, తీసివేయాలన్నా పార్లమెంటు ద్వారా చేయాలని, కోర్టులకు అధికారం లేదన్నారు. కార్యక్రమంలో గుబ్బల సురేష్, బొంతా శ్యాంకుమార్, చెట్టేబత్తుల చిరంజీవి, ఎం. బంగారయ్య, శీలి అజయ్, పాతాళ రవి, బి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి


మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశ దృశ్యం

చాగల్లు, సెప్టెంబరు 5: అధిక వర్షాలతో నీట మునిగిన రోడ్లు, డ్రైన్లలో మురుగు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేసి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు క్లోరినేషన్ చేయాలన్నారు. వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎస్ఐ కె.నరేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నల్లజర్ల, సెప్టెంబరు 5: వినాయక నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఎస్.శ్రీనివాస్ చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వినాయక నవ రాత్రి ఉత్సవ నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పనిసరి అని, విగ్రహం ఎత్తు ఐదడుగులు మించి ఉండరాదన్నారు. డీజే సౌండ్ సిస్టమ్ పెట్టుకునే వారు డీఎస్పీ అనుమతి పొందాలన్నారు. రాత్రి 10గంటల తరువాత ఏ విధమైన కార్యక్రమాలు చేయ్యరదన్నారు. ఊరేగింపు తేదీని ముందుగానే పోలీసులకు తెలియజేయలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కృష్ణారావు, ఎంపీడీవో సింహాద్రిరావు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రాజారావు

గోపాలపురం, సెప్టెంబరు 5: ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని అడిగి తెలుసుకునే అధికారాన్నే సమాచార హక్కు చట్టమంటారని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. చిట్యాల గ్రామంలో సమాచార హక్కు చట్టంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్యులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా పని చేయించుకోవడం, తనకు కావలిసిన సమాచారం సేకరించడం కష్టతరమైన నేపథ్యంలో ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచారహక్కు చట్టాన్ని అమలుల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వినాయక వ్రత పుస్తకం ఆవిష్కరణ


వ్రత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అల్లూరి విక్రమాదిత్య

తాళ్లపూడి, సెప్టెంబరు 5: మండలంలోని అన్నదేవరపేటలో గురువారం వినాయక వ్రత పూజా పుస్తకాన్ని టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య ఆవిష్కరించారు. వెయ్యి పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న పైడిమెట్ట ఎత్తిపోతల పథకం చైర్మన్ ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, బీజేపీ ఓబీసీ యువ మోర్చ అధ్యక్షుడు కలిశెట్టి సన్యాసినాయుడులతోపాటు పుస్తక రచయిత పరస రాధాకృష్ణను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గురజాల వెంకట ప్రసాద్(జీవీ), కూచిపూడి లక్ష్మణరావు, కొర్లపాటి దత్తుడు, బోడపాటి కాశీ, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, అబ్బులు, కొడమంచిలి జాన్‌బాబు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పెరవలి, సెప్టెంబరు5: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయాలని నిశ్చయించుకున్నట్టు జనసేన నాయకుడు పి.సూర్య నాగేశ్వరరావు అన్నారు. అన్నవరప్పాడులో గురువారం కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొప్పుప్పు సూర్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ ఆకుల అనంతలక్ష్మి, పొప్పుప్పు సూర్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 5: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన వేంద్ర వీరవెంకట సత్యనారాయణ 2013 ఫిబ్రవరి 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా కనిపించకపోవడంతో భార్య దుర్గాదేవి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

సిమెంట్ లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

రాజానగరం, సెప్టెంబరు 5: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ సమీపంలోని గురువారం సిమెంట్ లారీ బోల్తా పడింది. కోదాడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న సిమెంట్ లోడు లారీ మార్గమధ్యంలో జీఎస్ఎల్ సమీపంలో ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ముందు వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమంలో లారీ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒక వైపునకు ఒరిగిపోయినట్టుగా తెలుస్తోంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అలాగే రహదారిపై వాహనాల రాకపోకలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

ఆచార్య దేవోభవ


నన్నయ వర్సిటీలో నివాళులు

- సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
- మాజీ రాష్ట్రపతికి పూలమాలలతో నివాళి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- పలువురు ఉపాధ్యాయులకు సత్కారం

కొవ్వూరు, సెప్టెంబరు 5: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో గురుపూజోత్సవం జరిపి పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎండీ హుస్సేన్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, ముళ్ళపూడి కాశీవిశ్వనాథ్, కంటిపూడి గోపిచంద్ పాల్గొన్నారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో బీజీ కృష్ణమూర్తి స్మారక సమితి, వాజపేయం, ఆత్మీయ హితకారిని సమాజం, భారత వికాస పరిషత్ సంయుక్త నిర్వహణలో బర్రేపూడి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి టీవీ నారాయణరావు, దోర్బల ప్రభాకరశర్మ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. చామర్తి రమాదేవి, జి.సాయిసుధ, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, గోవర్ధనం శ్రీనివాసమూర్తిలను సత్కరించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో సంస్కృత పాఠశాల, మున్సిపల్ హైస్కూల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి, సంస్కృత పాఠశాల, కళాశాలల్లో ప్రతిభ కలిగిన 16 మంది విద్యార్థులకు నగదు పారితోషికాలు అందజేశారు.

నిడదవోలు: నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నిడదవోలు మిడ్‌టౌన్ అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబు మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఉపాధ్యాయుడే మార్గదర్శకుడని అలాంటి ఉపాధ్యాయులను ప్రతినిత్యం గౌరవించుకోవడం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రుద్ర, రోటరీ క్లబ్ సభ్యులు పెచ్చేటి పణిసింహ, ఆనందం మురళీకృష్ణ, గాలా రామవయ్య, షేక్ నాగూర్ మీరా వలి పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల హైస్కూల్‌లో సైన్సు టీచర్‌గా పని చేస్తున్న బొందల శ్రీనివాస్‌కు స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచార్యదేవోభవ జాతీయ అవార్డు లభించినట్టు ఆయనే స్వయంగా తెలిపారు. అలాగే గురువారం తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీనివాస్ బోధనతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్‌ఎం సుమతి,నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి అభినందించారు.

గోపాలపురం: వేళ్లచింతలగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో గన్నమనేని చిట్టిబాబు, యాళ్ల శ్రీనివాస్.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలిని ఘనంగా సత్కరించారు. కాగా శార్వాణి ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంటు రాపాక ఫణికిషోర్ ప్రైవేటు విద్యా సంస్థల కేటగిరిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. తాడేపల్లిగూడెం డైమండ్ లయన్స్ క్లబ్, పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేరిచర్ల మురళీకృష్ణరాయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో ఫణికిషోర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు వెలిగే కొవ్వొత్తి వంటి వారని ఆ వెలుగులో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతారన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులైన పరస శ్రీరామచంద్రమూర్తి, మారిశెట్టి నాగేశ్వరరావు, నోరి పేరిశాస్త్రిలను సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, గోకవరపు బాబులు, వి.చంద్రయ్య సనపల రాజశేఖర్, పెమ్మాడి దుర్గాప్రసాదు, ఇంజరపు అబ్బులు, చెరుకు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలోని నెం.1 పాఠశాలలో జరిగిన సమావేశంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో జి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ గురువులను ప్రతిఒక్కరూ గౌరవించాలని చెప్పారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనరాజు, శారదా జ్యోత్స్న, యూటీఎఫ్ నాయకుడు ఐ.రాంబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎన్ కుమార్, ఏవో ఆనంద్‌ప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు యలమాటి సత్యనారాయణ దంపతులను విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్కరించింది. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు కేశిరాజు సీతారామయ్య, పప్పు వెంకటరామారావు, బండి సూర్యప్రకాశరావు, వీరవల్లి శేషమణి,నరహరశెట్టి లక్ష్మీప్రసాద్, బళ్లా సూర్యచక్రం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఆనంద్‌కళా కేంద్రంలో రామన్నపాలెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పేరం రవీంద్రనాథ్ జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డును కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే మండలంలో దేవరపల్లి స్పెషల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణ, దుద్దుకూరు నుంచి ఎం.అప్పారావు, శ్రీదేవి, గౌరీపట్నం హైస్కూల్ నుంచి ఎస్.విజయశ్రీ, చిన్నాయిగూడెం నుంచి ప్రవీణ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, అప్పారావులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.


కొవ్వూరులో గురువులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


తాళ్లపూడిలో విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


ఉండ్రాజవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అధికారులు


దేవరపల్లి:రిటైర్డ్ టీచర్ సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


గోపాలపురం: వేళ్లచింతలగూడెంలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలి

నన్నయ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 5: విద్యార్థులకు గురువులు మార్గదర్శకంగా ఉండాలని, వారి ఉన్నతిని కోరుకోవాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వీసీ పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తినుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లిని గురువులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాత్ర కీలకమైనదని, మహనీయుల ఆశయసాధనకు అనుగుణంగా సమాజశ్రేయస్సు కోసం గురువులంతా కృషిచేయాలని సూచించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంనుంచి సన్మానం పొందిన నన్నయ వర్సిటీ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి తదితరలు పాల్గొన్నారు.


విజయవాడ 20వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 5: విజయవాడలోని కృష్ణలంక 20వ డివిజన్‌లో మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడంతో పాటు మందులు అందజేశారు. ఫుడ్ ప్యాకెట్‌లు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు. అనంతరం కొవ్వూరు మున్సిపాల్టీ నుంచి విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టడానికి వెళ్లిన కార్మికులను ఎమ్మెల్యే ముప్పిడి కలిశారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సీఎం చంద్రబాబు తమకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

సాయం చేసిన చేతులు

- వరద బాధితులకు ఆహార ప్యాకెట్ల తరలింపు

చాగల్లు నుంచి 2500 ఆహార పొట్లాలు

చాగల్లు, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయం కోసం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2500 ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు సమకూర్చారు. వాటిని విజయవాడకు తరలించే వ్యాన్‌ను ఏఎంసీ మాజీ ఆళ్ల హరిబాబు గురువారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కేతా సాహెబ్, దొంగ రామక్రిష్ణ, కోడి చంటియ్య, ముళ్ళపూడి రాము, తాల్లూరి ప్రసాద్, కరుటూరి బాలక్రిష్ణ, జుజ్జువరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీనార్ మసీదు సభ్యుల ఆధ్వర్యంలో..

నల్లజర్ల, సెప్టెంబరు 5: వరద బాధితులకు నల్లజర్లలో హలాల్ బిర్యాని సెంటర్ వారి సౌజన్యంతో స్థానిక మీనార్ మసీదు సభ్యులు పులిహోరా పొట్లాలను పంపించారు. కార్యక్రమంలో బిర్యాని సెంటర్ యజమాని షమీమ్, షేక్ సర్దార్, మసీదు అధ్యక్షుడు రఫీ, జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, ఇమాం సుబాస్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు విరాళాలు సేకరించాలి: మద్దిపాటి


విజయవాడ 21వ డివిజన్‌లో బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, సెప్టెంబరు 5: విజయవాడలోని 21వ డివిజన్‌లో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో మూడో రోజు సహాయక చర్యల్లో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. గురువారం వరద బాధితులకు ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు మూడు రోజులుగా 21వ డివిజన్‌లో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించాలని పిలుపునిచ్చారు. సేకరించిన మొత్తాని సీఎం సహాయనిధికి అందజేయనున్నామన్నారు.


చాగల్లు నుంచి విజయవాడకు ఆహార పొట్లాలు తరలిస్తున్న నాయకులు


నల్లజర్లలో మీనార్ మసీదు సభ్యులు తయారు చేసిన ఆహార పొట్లాలు

ఆర్వోబీ పనులతో వాహనదారుల అవస్థలు

- బురదలో కూరుకుపోయిన లారీ
- సుమారు రెండు గంటలు పైగా నిలిచిపోయిన రాకపోకలు





నిడదవోలు, సెప్టెంబరు 5: నిడదవోలులోని నెహ్రూబొమ్మ సెంటరులో ఉన్న రైల్వేగేటు స్థానంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనుల వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఒక పక్క నిర్మాణ పనులు మరో పక్క భారీ వర్షాలతో నిడదవోలు మెయిన్ రోడ్డుతో పాటు తాడేపల్లిగూడెం వైపు వెళ్లే బసివిరెడ్డిపేట ప్రాంతంలో ఆర్వోబీ నిర్మాణ పనులతో ఆ ప్రాంతమంతా అస్తవ్యస్తంగా ఉంది. బసివిరెడ్డిపేట వద్ద ఆర్వోబీ పిల్లర్ల నిర్మాణానికి భూమి లోపల వరకు తవ్వడం, దీనికి తోడు కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారి వాహనదారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గురువారం మధ్యాహ్నం నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు కంకర తీసుకెళుతున్న క్వారీ లారీ టైర్లు బురదలో కూరుకుపోయి నిలిచిపోయింది. దీంతో తాడేపల్లిగూడెం, నిడదవోలు మధ్య వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటలు పైగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తర్వాత ప్రొక్లెయినర్ సహాయంతో లారీని ముందుకు కదిలించడంతో వాహన రాకపోకలు మొదలయ్యాయి. ఆర్వోబీ నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్ట్ ఏజెన్సీ పర్యవేక్షణా లోపం కారణంగా నిత్యం అవస్థలు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

గుండెకు శస్త్రచికిత్సకు సీఎం సహాయనిధి

దేవరపల్లి, సెప్టెంబరు 5: పేదలను ఆదుకోవడంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం బుచ్చయ్యపాలెం గ్రామంలోని పల్లంట్ల ధర్మరాజుకు అనారోగ్య కారణంగా గుండెకు శస్త్రచికిత్స చేయించుకోలేని నిరుపేద కుటుంబానికి వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కలవడంతో వెంటనే స్పందించి చంద్రబాబుతో మాట్లాడి సీఎం సహాయ నిధి ద్వారా రూ.4 లక్షలు తక్షణ ఆర్థిక సాయం అందించినట్టు మద్దిపాటి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, కాట్రు వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో పాపం.. మూగజీవం

నిడదవోలులో గోవధ ముఠా పట్టివేత - ఆరుగురిపై కేసు




ఇంత దారుణమా : గోవధ కేంద్రంలో ఏరులై పారుతున్న మూగజీవాల రక్తం

నిడదవోలు, సెప్టెంబరు 5 : అనధికారికంగా గోవులను ఎద్దులను వధించి విక్రయాలు సాగిస్తున్న ముఠాపై నిడదవోలు పట్టణ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ మేరకు పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పట్టణ ఎస్ఐ పసుపులేటి శోభన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా ఎస్పీకి వెళ్లిన రహస్య సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు ఆకస్మికంగా దాడి చేశామన్నారు. గోవధకు ప్రధానమైన వ్యక్తి అబ్దుల్ రషీద్‌తో పాటు మరో ఐదు గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.వీటి మాంసాన్ని తరలించే నాలుగు ఆటోలను సీజ్ చేసి చనిపోయిన ఐదు జీవాలను అధికార్ల సమక్షంలో పంచ నామా చేసి వాటిని మునిసిపల్ డంపింగ్ యార్డులో ఖననం చేశా మని తెలిపారు.మరో 50 ఆవులు, ఎద్దులను తాడేపల్లిగూడెం గోశాలకు తరలిస్తున్నామన్నారు.ఆవులు, ఎద్దులు, గేదెలు లాంటి వాటిని ఎవరైన వధించినా వాటిమాంసాన్ని విక్రయించినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.